క్లుప్తంగా

7న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

మణుగూరు రూరల్: 2022–23 ఆర్థిక సంవత్సరానికిగానూ తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 7న మున్సిపాలిటీ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు తమ వెంట ఆధార్, రేషన్, పాన్ కార్డులు, ఆదాయ, వృత్తి నైపుణ్యత, విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని సూచించారు. కేటగిరి–1లో లక్ష రూపాయల రుణాలకు గాను మూడు యూనిట్లను ఎస్‌బీఐ, కేటగిరి–2లో రూ.2లక్షల రుణాలకు గాను రెండు యూనిట్లను ఏపీజీవీబీకి కేటాయించడం జరిగిందన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు ఆయా బ్యాంకుల ద్వారానే రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు పనులు పరిశీలన

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం నుంచి లక్ష్మీపురం (ఎల్ఎల్ రోడ్డు) వరకు రూ.20 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఆర్అండ్‌బీ శాఖ సీఈ సతీష్, ఎస్ఈ లక్ష్మణ్‌నాయక్‌లు శుక్రవారం పరిశీలించారు. పనులను పరిశీలించి పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. వారి వెంట ఈఈ భీమ్లానాయక్, డీఈ హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

పొదెంను విమర్శించడం సరికాదు

దుమ్ముగూడెం: భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య విమర్శించే అర్హత విప్ రేగా కాంతారావుకు లేదని కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా చైర్మన్ కనుబుద్ది దేవా పేర్కొన్నారు. భద్రాచలానికి వీరయ్య టూరిస్ట్ అని పేర్కొనడం గర్హనీయమని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఇకనైనా ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలని సూచించారు.

బూర్గంపాడు: డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్యను విమర్శిస్తే ఊరుకోమని టీపీసీసీ సభ్యులు తాళ్లూరి చక్రవర్తి హెచ్చరించారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మహ్మద్‌ఖాన్, మోహన్‌రెడ్డి, కృష్ణ, నయీమ్, పాషా, హుస్సేన్, బోటే పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

అశ్వాపురం: అశ్వాపురం తహసీల్దార్‌గా ఎం.ఎ.రాజు తహసీల్‌లో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని రేషన్ డీలర్లు తహసీల్దార్‌ను కలిసి సన్మానించారు.

తహసీల్దార్‌కు సన్మానం

అశ్వాపురం: తహసీల్దార్ గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ సురేష్‌కుమార్ దంపతులను అశ్వాపురంలో శుక్రవారం ఆర్య వైశ్య సంఘం మండలాధ్యక్షుడు బచ్చు స్వరాజ్యరావు ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు, నాయకులు సర్వేశ్వరరావు, రేపాక సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, జీఎస్.రావు, టీవీఎల్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

భద్రాచలంటౌన్: ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు సతీమణి శారద వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కూనవరం రోడ్డులోని సరోజమ్మ వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఎంపీఎస్ నారాయణ, సుబ్బయ్య చౌదరి, సత్యనారాయణ శారద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పంచాయతీ పరిధిలోని సీతానగరంలో గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన శ్యామల వెంకట్ కుటుంబానికి సర్పంచ్ వరలక్ష్మి నిత్యవసర సరుకులతో పాటు 50 కిలోల బియ్యం వంట సామగ్రి 1,500 రూపాయలు, బీఆర్ఎస్ నాయకులు నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, నగదును అందజేశారు. బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో 20 కేజీల బియ్యం, నిత్యావసరాలను అందచేశారు. ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అన్నె సత్యానారాయణమూర్తి తెలిపారు లక్ష్మణ్, జానీపాషా, ఎంపీటీసీలు తెల్లం భీమరాజు, తిరుపతిరావు, వార్డ్ మెంబర్ వెంకటరమణ, హరికృష్ణ, పాల్గొన్నారు.

బిల్లులు మంజూరు చేయాలి

ములకలపల్లి : గ్రామాభివృద్ధి కోసం గ్రామపంచాయతీలకు కేటాయించాల్సిన నిధులను వెంటనే మంజూరు చేయాలని జెడ్పీటీసీ సున్నం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలపరిధిలోని మాధారం గ్రామంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడగా మండల నాయకులు ఎండీ.అంజుం, పుష్పాల హనుమంతు, ఎస్కే.ఖాదర్ బాబా, బూరుగుపల్లి పద్మశ్రీ పాల్గొన్నారు.

వ్యసనాల బాటలో..



మత్తుకు అలవాటు పడుతున్న యువత

- యథేచ్ఛగా గంజాయి, మద్యం సేవిస్తూ..
- గుంపులుగా చేరి గొడవలు పడుతున్న వైనం
- అధికారులు పట్టించుకోవాలని ప్రజలు వేడుకోలు



మండలం మీదుగా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన యువకులతో పోలీసులు (ఫైల్)

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని దుమ్ముగూడెం మండలంలో రోజురోజుకూ మత్తు పదార్థాలకు బానిసలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రధానంగా యువత దాని బారినపడి జీవితాలను కోల్పోతున్న పరిస్థితులున్నాయి. మద్యమే కాకుండా పొగాకు, గంజాయి, కొన్ని రకాల రసాయనాలను పీల్చడం వంటి వ్యసనాలు పెరుగుతున్నాయి. ఇందులో ప్రధానమైనది మద్యం, గంజాయి వినియోగించి ఆరోగ్యాలను సైతం కోల్పోతున్నారు.

గంజాయికి అడ్డాగా పర్ణశాల క్రాస్ రోడ్డు

మండలంలోని పర్ణశాల క్రాస్ రోడ్డు, సీతానగరం ప్రాంతాలు గంజాయి బాబులకు అడ్డాగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది యువకులు ఒక దగ్గరకి చేరి గంజాయి దమ్ము కొడుతున్నారనే విశ్వసనీయ సమాచారం. ఇంత వరకు నాటు సారా, మద్యానికి మాత్రమే అలవాటు పడిన యువత రానురాను గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. రోడ్డు పక్కన గల అటవీప్రాంతంలో గంజాయి సేవిస్తూ మత్తులో తూగుతున్నారనే ఆరోపణలు ప్రజల నుండి వస్తున్నాయి.

అర్ధరాత్రి వరకు రోడ్డు మీదనే..

జల్సాలకు అలవాటు పడిన యువత రాత్రి 10గంటలు దాటినా కూడా రోడ్ల పైనే సంచరిస్తూ గుంపులు గుంపులుగా చేరి గొడవలకు సైతం దిగుతున్నారని స్థానికులు తెలుపుతున్నారు. వారం రోజుల క్రితం ఓ గ్రామంలో జరిగిన జాతరలో ఇద్దరి మధ్యన జరిగిన చిన్న గొడవ రెండు గ్రామాల యువత 40, 50 మంది దాడులు చేసుకునే వరకు వెళ్లింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అల్లరిమూకలను చెదరకొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. లేకుంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకుంటేనే భయం వేస్తుందని ప్రజలు వాపోతున్నారు.

హైస్పీడ్ బైక్‌లతో రయ్.. రయ్..

ఏజెన్సీలోని యువత హైస్పీడ్ ద్విచక్ర వాహనాలపై అదూఅదుపు లేకుండా స్పీడ్‌గా వెళ్తూ పాదచారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నంబర్ ప్లేట్‌లు లేకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదాలు జరిగిన తప్పించుకునే ఎత్తుగడలను యువత పాటిస్తున్నారు. యువతను అదుపులో పెట్టాల్సిన అవసరం తల్లిదండ్రులకు చాలా ఉంది అలాగే ప్రజాప్రతినిధులు కూడ ముందుకు వచ్చి తమ గ్రామాల్లోని యువతకు కౌన్సిలింగ్ ఇచ్చి పెడదోవ పట్టకుండా చర్యలు తీసుకోవాలి. ప్రధాన రహదారిపై పోలీసులు రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించి, అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు



యువత గంజాయి, మద్యానికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. తాగిన మైకంలో గొడవలు పెట్టుకుని క్రిమినల్ కేసులు నమోదైతే చేజేతులారా జీవితాలను నాశనం చేసుకున్నవాళ్లు అవుతారు. గంజాయికి అలవాటు పడి అనారోగ్యం పాలు కావద్దు మంచి జీవితాలను లక్ష్యంగా ఎంచుకుని యువత ముందుకు వెళ్లాలి. మద్యం మత్తులో వాహనాలను నడిపి ప్రాణాలను తీసుకోవద్దు మైనర్‌లకు వాహనాలు ఇస్తే యజయానులపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది.

– దోమల రమేష్, సీఐ, దుమ్ముగూడెం

ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రహమాన్

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లిలో జరగనున్న శివరాత్రి, శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు కొత్తగూడెం డీఎస్పీ ఎస్‌కె.అబ్దుల్ రహమన్ తెలిపారు. ఈనెల17 నుంచి 19 వరకు నిర్వహించనున్న మహా శివరాత్రి, మార్చి 5 నుంచి 10 వరకు నిర్వహించనున్న శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలపై తహసీల్దార్ భద్రకాళి అధ్యక్షతన శుక్రవారం శివాలయ ప్రాంగణంలో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేలా అధికారులు పనిచేయాలని తహసీల్దార్‌ను కోరారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖలకు చెందిన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ వసంతకుమార్, ఆలయ మేనేజర్ రమణ, ఎస్సై విజయ, సర్పంచ్ బోడా పద్మ, ఆలయ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏసీడీ పేరుతో భారం మోపొద్దు



మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

మణుగూరుటౌన్: ఏసీడీల పేరుతో ప్రజలపై విద్యుత్ శాఖ అదనపు భారం మోపడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. శుక్రవారం మణుగూరులోని శ్రామిక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పేదలు మధ్యతరగతి ప్రజలపై దొంగచాటుగా ఏసీడీ పేరుతో విద్యుత్ భారం వేయడం సరికాదన్నారు. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయరంగానికి 24గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సిబ్బంది కొరతతో ప్రతి నెల 30రోజులకు తీయాల్సిన రీడింగ్ 40 రోజులకు తీస్తూ ప్రజలపై పరోక్షంగా భారం వేస్తున్నారన్నారు. ఏసంగి పంటలకు విద్యుత్ కొరత లేకుండా చూడాలన్నారు. వ్యవసాయానికి 24గంటలు విద్యుత్ సరపరా చేస్తామని చెప్పి విస్మరించిందన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏజే.రమేష్, జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కొడిశాల రాములు, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లింగమంతుల జాతరకు రండి..



ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గ్రామమైన రేగులగండి గ్రామంలో లింగమంతుల స్వామి ఆలయం వద్ద ఈ నెల 5 నుంచి జరిగే లింగమంతుల జాతర, 6న జరగనున్న స్వామి వారి కల్యాణ మహోత్సవానికి రావాలని యాదవ సంఘం నాయకులు, జాతర నిర్వహణ కమిటీ నాయకులు శుక్రవారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. యాదవ సంఘం నియోజకవర్గ నాయకుడు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములుతో పాటు ముఖ్య నాయకులకు ఆహ్వానపత్రికలు అందజేశారు. జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు లంకెల రమేష్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ రాజు, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై జితేందర్, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు కందుల కృష్ణార్జున్‌రావు, ఎంపీటీసీ సంఘం మండల అధ్యక్షురాలు దుర్గాభవాని, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానపత్రికలు అందజేశారు.

మోరె రవిపై పీడీ యాక్టు రద్దు చేయాలి

గుండాల: న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి మోరే రవిపై నమోదు చేసిన పీడీ యాక్టు కేసును వెంటనే రద్దు చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, ఎంపీపీ ముక్తి సత్యం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... రవి భద్రాచలం డివిజన్‌లో బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతం పోరాడుతున్నాడన్నారు. ఈ క్రమంలో పోలీసులు తీసుకెళ్లి రవి వద్ద ఆయుధం దొరికినట్లు సృష్టించి కేసులు నమోదు చేసి జైలు పంపారన్నారు. అక్రమంగా అరెస్టు చేసి,. కేసులు పెట్టడాన్ని తీవ్రంగా నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సర్పంచ్ కోరం సీతారాములు, అరెం నరేష్, పర్శిక రవి, యాసా రపు వెంకన్న, గడ్డం లాలయ్య, ఈసం క్రిష్ణ, అజ్గర్, బానోతు లాలు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

అశ్వాపురం: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు ఐక్యంగా కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ నాయకుడు బట్టా విజయగాంధీ అన్నారు. మండల పరిధిలోని పాములపల్లి, బట్టీలగుంపు గ్రామాల్లో శుక్రవారం సర్పంచ్ బట్టా సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా విజయగాంధీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బేతం రామకృష్ణ, గాదె కేశవరెడ్డి, గుర్రం చెన్నయ్య, కాకా రాములు, తూము వీరరాఘవులు, వెంకటరమణ, నరసింహారావు, బొర్రా భద్రయ్య, వెంకటేశ్వర్లు, బొర్రా శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

మణుగూరుటౌన్: బీజేపీ మణుగూరు పట్టణ కార్యాలయాన్ని శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ కార్యాలయాన్ని పినపాక అసెంబ్లీ కన్వీనర్ పున్నం భిక్షపతి ప్రారంభించారు. పట్టణాధ్యక్షుడు లింగపల్లి రమేష్ జెండా ఆవిష్కరించారు. ప్రారంభించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ... నియోజకవర్గంలో బీజేపీని బలమైన శక్తిగా తయారు చేయడానికి కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలన్నారు. రానున్న కాలంలో పినపాక నియోజకవర్గంలో బీజేపీ ఎదురులేని శక్తిగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సీతారాం నాయక్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దివ్యశ్రీ, గిరిజన మోర్చా నాయకులు ఈసాల వెంకటేశ్వర్లు, బీసీ మోర్చా రవీందర్, కుంజా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సామగ్రి పంపిణీ

దమ్మపేట: మండల పరిధిలోని పూసుకుంట గ్రామంలో నివసిస్తున్న కొండరెడ్లకు టార్పాలిన్లు, స్టీల్ సామగ్రిని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, భద్రాచలం వారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. శుక్రవారం పూసుకుంట గ్రామంలోని కొండరెడ్ల తెగకు చెందిన 53 కుటుంబాలకు టార్పాలిన్లు, వంట సామగ్రిని సర్పంచ్ ఉమ్మల దుర్గ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కలెక్టర్ అనుదీప్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని నిర్వాహకులు డాక్టర్ కాంతారావు తెలిపారు. సూర్యనారాయణ, రాజిరెడ్డి, దేశప రవిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

భద్రాచలంటౌన్: పట్టణంలోని బిడ్డి సెంటర్‌లోని శ్రీశ్రీశ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శని, ఆది వారాల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

ఇళ్లస్థలాలు కేటాయించాలని మౌనదీక్ష



దీక్ష చేస్తున్న ఆదివాసీలు

భద్రాచలంటౌన్: రాజుపేట కాలనీ శివారులో స్థావరాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న ఆదివాసీలకు ఆ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శుక్రవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆదివాసీలు మౌనదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు మాట్లాడుతూ... మూడు నెలలుగా రాజుపేట కాలనీ శివారులోని సర్వే నంబరు 52, 53 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివసిస్తుండగా నేడు అధికారులు వచ్చి ఖాళీ చేయాలని దౌర్జన్యం చేపించారన్నారు. వారిపై దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేయడానికి పోలీసు స్టేషన్‌కు వెళ్తే తిరిగి 40 మందిపై కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఐటీడీఏ పీఓనే న్యాయం చేయాలని కోరుతూ మౌన దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు పీవో గౌతమ్ పోట్రుకు వినతి పత్రం అందజేయగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు. ఈ కార్యక్రమంలో గనిబోయిన సింపిరయ్య, పాయం రామకృష్ణ, నల్లబోయిన బాబురావు, తెల్లం వెంకటరమణ, సోయం ఉమాదేవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓను కలిసిన ఏఎస్పీ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఎస్పీ

భద్రాచలం: భద్రాచలం నూతన ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పరితోష్ పంకజ్ ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఐటీడీఏకు వెళ్లి పీఓ ఛాంబర్‌లో పుష్పగుచ్ఛం అందచేశారు.

ఏఎస్పీకి అభినందనల వెల్లువ



ఏఎస్పీని సత్కరిస్తున్న రోశిరెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పరితోష్ పంకజ్‌ను ఎస్ఎస్ఆర్డి ట్రస్ట్ బోర్డ్ మాజీ సభ్యుడు యడమకంటి రోశిరెడ్డి, టీఎన్జీవోస్ నాయకులు డెక్క నరసింహారావు, నాగభూషణంఆయనను సత్కరించారు. కృష్ణారెడ్డి, బాలకృష్ణ, నర్సింహారావు, గాంధీ, లింగమూర్తి పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

ములకలపల్లి : ఈనెల 6న దమ్మపేటలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ నాయకులు జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ అంజి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు నాగళ్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ కీసరి శ్రీను, సుధాకర్, పెద్దవెంకన్న, తిరుపతిరెడ్డి, నాగయ్య, నర్సింహారావు, మునీశ్వరరావు, జైరెడ్డి పాల్గొన్నారు.

దర్శకుడు విశ్వనాథ్‌కు నివాళి

దుమ్ముగూడెం: భారతీయ సాంప్రదాయ, సంస్కృతి ప్రతిబింబించే సినిమాలు తీసిన దర్శకుడు విశ్వనాథ్ మరణం సినీ లోకానికి తీరని లోటని కళాకారులు అన్నారు. దర్శకుడు విశ్వనాథ్ మృతికి శుక్రవారం మండలంలోని లక్ష్మీనగరంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నివనాళులర్పించిన వారిలో జిల్లా తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య జిల్లా సంయుక్త కార్యదర్శి దామోదరరావు, నాగేంద్ర రెడ్డి, ముక్కెర రాంబాబు, ప్రభాకర్, రామారావు, కృష్ణార్జున రావు, వెంకటరమణారెడ్డి, కర్రి శివకుమార్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మణుగూరుటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని ఏటూరు నాగారం ప్రధాన రహదారిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా ఇసుక బంకర సమీపంలో అదుపతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో వ్యక్తికి గాయలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో అతన్ని ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

క్రీడల్లో రాణించాలి

దుమ్ముగూడెం: గిరిజన యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనిసీఐ దోమల రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని గౌరారం గ్రామంలో ఫ్రెండ్స్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీలు స్నేహపూరిత వాతావరణంలో నిర్వహించాలని, యువత చదువులో రాణించి ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను సంపాదించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, ఎంపీపీ రేసు లక్ష్మీ, సర్పంచ్ సోడి జ్యోతి, కణితి రాముడు, కణితి లక్ష్మణ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చర్లలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

చర్ల: చర్లలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో తహసీల్దార్ బి.భరణిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొండా చరణ్ మాట్లాడుతూ... చర్లలో అగ్నిప్రమాదాలు జరిగిన సందర్భంలో భద్రాచలం నుంచి ఫైర్ ఇంజన్ వచ్చేలోపు జరగాల్సిన నష్టం అంతా జరిగిపోతుందన్నారు. లంకా వెంకట్, మునిగల శివ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

దమ్మపేట: రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్‌లో వినతిపత్రం అందజేశారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం కార్యాలయంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. నాయకులు సుంకుపాక ధర్మ, జవాడ రాము, విజయలక్ష్మి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఎంను కలిసిన సీఈ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న బిచ్చన్న

మణుగూరుటౌన్: సింగరేణికాలరీస్ కంపెనీ మణుగూరు ఏరియాకు నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన దుర్గం రాంచందర్‌ను శుక్రవారం బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన జీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, ఎస్ఈ సీహెచ్‌పీ బీటీపీఎస్ సూర్యనారాయణ, డీఈ ఫ్యూయల్ అండ్ ఆపరేషన్ బీటీపీఎస్ జేజీనారాయణ, ఏడీఈ కోల్ మానిటరింగ్ బీటీపీఎస్ ధీరేంద్రనాథ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వరిపంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న శివరాంప్రసాద్

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటలను శుక్రవారం మండల వ్యవసాయశాఖాధికారి పి.శివరాంప్రసాద్ పరిశీలించారు. మండలంలోని లింగాల, ముమ్మిడివరం, ఆర్.కొత్తగూడెం, గోగుబాక తదితర గ్రామాల్లో రైతులు సాగి చేసిన పంటలను పరిశీలించిన వ్యవసాయశాఖాధికారి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వరి పంటలకు ఆకుమడుత, కాండం తొలిచే పురుగులు వ్యాపిస్తున్నాయని ఆయన తెలిపారు. మండల వ్యవసాయశాఖాధికారి వెంట ఏఈఓ పృథ్వీరాజ్, రైతులు ఇందుల రమేష్, సీతాపతిరాజు, నీలాద్రివర్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలనపై విద్యార్థులకు అవగాహన

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని ఎక్స్‌లెంట్ విద్యాసంస్థలోని విద్యార్థులకు గ్రామ పంచాయితీ పాలనపై శుక్రవారం సమితిసింగారం పంచాయతీలో సర్పంచ్ బచ్చల భారతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పంచాయతీ పాలనపై విద్యార్థులకు మరింత అర్థమయ్యే విధంగా వివరించిన సర్పంచ్‌ను, పంచాయతీ కార్యదర్శిలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం ఎండి. యూసఫ్‌షరీఫ్, ఉపాధ్యాయులు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

మణుగూరు రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని మణుగూరు సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశానికి జిల్లా డీసీసీబీ ఏజీఎం పి.వెంకటేశ్వర్లు, మణుగూరు బ్రాంచ్ మేనేజర్‌లు పలు సలహాలు ఇచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు పొందిన రైతుల నుండి వడ్డీలు, రుణాలను తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. సకాలంలో రుణాలు, వడ్డీలు చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సొసైటీ కార్యదర్శి జ్ఞానదాసు, సిబ్బంది తాజుద్దీన్, రాఘవులు, శివ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత

మణుగూరు రూరల్: మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామపంచాయతీ వాలీబాల్ క్రీడాకారులకు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆదేశాల మేరకు రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వాలీబాల్ కిట్‌ను బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు అడపా వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు అన్నమనేని రాజేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు చిడెం నాగేశ్వరరావు, క్రీడాకారులు నాగేంద్ర, నవీన్, సాయి పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం



మాట్లాడుతున్న హేమంతరావు

ములకలపల్లి: బీజేపీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు విమర్శించారు. మండలకేంద్రంలో శుక్రవారం జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్పొరేట్ దిగ్గజాలకు మోదీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని ధ్వజమెత్తారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని ఐదు స్థానాల్లో సీపీఐ పోటీకీ సిద్ధంగా ఉందన్నారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబిర్ పాషా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల పేదప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. నరాటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, రావులపల్లి రవికుమార్, వై.శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి శ్రీనివాసరావు, నలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేశ్‌కుమార్, రేసు ఎల్లయ్య, దేవరకొండ శంకర్, వై.భాస్కర్ పాల్గొన్నారు.